## క్లుప్తంగా

### వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు అందజేస్తున్న సర్పంచ్ బాలా రామలక్ష్మి

**పూసపాటిరేగ:** సంక్రాంతి పురస్కరించుకుని, మండలంలోని గోవిందపురంలో సర్పంచ్ బాలా రామలక్ష్మి, వైస్ సర్పంచ్ బాలా అప్పల రాజు నిరుపేదలకు ఆదివారం వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రతీ ఏటా పండగ సందర్భంగా వస్త్రదానం చేస్తున్నామని, ఈ ఏడాది గ్రామంలో మొత్తం 400 మందికి వస్త్రాలు అందజేసినట్లు ఆమె తెలిపారు.

### ప్రశాంతంగా పండగ జరుపుకోవాలి: సీఐ

**రాజాం:** ప్రశాంత వాతావరణంలో భోగి, సంక్రాంతి, కనుమ పండగలు నిర్వహించుకోవాలని రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర సూచించారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండగ సమయంలో పేకాట, కోడిపందేలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని సూచించారు. సంక్రాంతి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే తిరిగి వచ్చేవరకు వారి ఇంటికి భద్రత కల్పిస్తామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చేయొద్దని సూచించారు.

### అగ్నిఅస్త్రంతో కత్తెర పురుగు నివారణ



వంగర: అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**వంగర:** మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును అగ్నిఅస్త్రంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.టి.కిరణ్‌కుమార్, వెంకటరమణ అన్నారు. మండలంలోని కింజంగి గ్రామంలో ఆదివారం మొక్కజొన్న పంట సాగుచేస్తున్న రైతులకు అగ్ని అస్త్రం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. గోమూత్రం, పొగాకు, పచ్చిమి ర్చి, వెల్లుల్లి, వేపాకులతో అగ్నిఅస్త్రాన్ని ఏవిధంగా తయారు చేయవచ్చో వివరించారు.

### రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు

**రేగిడి:** మండలంలోని సంకిలి పంచాయతీలో రూ.30 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి సంధ్యాశ్రీనివాసరావులు తెలిపారు. సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తుండడంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

### భక్తిశ్రద్ధలతో పొన్నాకుల హారతి



వేంకటేశ్వరస్వామికి హారతి సమర్పిస్తున్న భక్తులు

**బొబ్బిలి:** పట్టణంలోని కంచరవీధిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పొన్నాకుల హారతి కార్యక్రమం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామికి హారతి సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

### 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

**బాడంగి:** మండలంలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమని మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 17 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 6,697 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయి కొనుగోలు పూర్తవుతుందన్నారు. ప్రస్తుతం రబీ పంటలకు చెందిన ఈ–క్రాప్ బుకింగ్ జరుగుతోందన్నారు. పీఎం కిసాన్ యోజన కోసం ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని రైతులను కోరారు.

# అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ



విజయనగరం: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- లూయిస్ బ్రెయిలీ జయంతిలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో సారధి వెల్ఫేర్ అసోసియేషన్, విజువల్లి చాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి ఆదివారం నిర్వహించారు. తొలుత జెడ్పీ చైర్మన్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంధత్వాన్ని జయించి, అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపించిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని అన్నారు. బ్రెయిలీ లిపి నేర్చుకుని నేడు ఎంతోమంది వివిధ రంగాల్లో విజయం సాధిస్తున్నారని తెలిపారు. దివ్యాంగుల కోసం ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక పథకాలను మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మీ సేవా కేంద్రాన్ని దివ్యాంగుల వసతి కోసం తక్కువ రుసుంతో కేటాయించడం జరుగుతోందన్నారు. అన్ని వసతులు కల్పించాలని దివ్యాంగుల శాఖ డైరెక్టర్‌ను జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ వసతి గృహానికి నెలవారీ అయ్యే రుసుంను తాను అందజేస్తానని ప్రకటించారు. అనంతరం అసోసియేషన్‌కు సంబంధించిన క్యాలెండర్‌ను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణితో కలిసి వారు ఆవిష్కరించారు. సేల్స్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి.రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వికలాంగుల శాఖ ఏడీ జీవీబీ జగదీష్, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్స్ డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ వ్యవస్థాపకులు దవడ కొండ బాబు, సారధి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ప్రదీప్‌కుమార్, ఎల్.రత్నరాజు పాల్గొన్నారు.

**రూ.1.2 లక్షల విలువైన బ్యాగుల అందజేత..**

**విజయనగరం టౌన్:** అంధులకు అక్షర జ్ఞానం ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా సారధి వెల్ఫేర్ అసోసియేషన్, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం అంధ ఉద్యోగుల యూనియన్‌ల ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల విలువైన ట్రావెల్, స్కూల్ బ్యాగ్‌లను స్థానిక తోటపాలెంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ధీర ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి అంధ విద్యార్థుల నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ వ్యక్తులతో పాటే అసాధారణ ప్రతిభను చూపిస్తూ అందరి మన్ననలు పొందుతున్న అంధులకు ప్రతి ఒక్కరూ తమవంతు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొత్స సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.సాయిదేవమణి, సారధి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు ప్రదీప్ పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: అంధ విద్యార్థుల నిర్వాహకులకు బ్యాగులను అందజేస్తున్న సత్య విద్యాసంస్థల డైరెక్టర్ శశిభూషణరావు

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి




డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణిని సన్మానిస్తున్న తైక్వాండో క్రీడాకారులు

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

**విజయనగరం:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్ వెనక ఉన్న ఇన్‌స్పైర్ స్కూల్ ఆవరణలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏపీ తైక్వాండో అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో విజయనగరానికి చెందిన విన్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోచ్‌లు, క్రీడాకారుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమని, అందరూ క్రీడాస్ఫూర్తి కనబరిచి మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల టైక్వాండో క్రీడాకారులు మరింత మెలకువలు నేర్చుకుని, భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం ఆమెను నిర్వాహకులు, క్రీడాకారులు సత్కరించారు. కార్యక్రమంలో చారి, రిఫరీ కోదండరాం, పెద్దింటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# తప్పుల్లేని డీఎల్ఆర్ తయారు చేయండి



డి.గదబవలస డీఎల్ఆర్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

**తెర్లాం:** జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే పూర్తయిన మండలంలోని డి.గదబవలస గ్రామానికి చెందిన డీఎల్ఆర్(డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)ను తప్పులు లేకుండా తయారు చేయాలని తహసీల్దార్ దోల రాజేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డి.గదబవలస డీఎల్ఆర్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన డీఎల్ఆర్ తయారు చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూముల రీసర్వేలో డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయిన తర్వాత డీఎల్ఆర్ తయారు చేయడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రభుత్వ, బంజరు, పోరంబోకు భూములకు సంబంధించి, డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ తయారు చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆయన వెంట మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ శ్రీనివాసరావు ఉన్నారు.

## రేపు 'మానవ జీవితంలో మొదటి వెయ్యి రోజులు' సదస్సు



సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**విజయనగరం:** నగరంలోని కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 10వ తేదీన 'మానవ జీవితంలో మొదటి వెయ్యి రోజులు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక కొత్త అగ్రహారంలోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్, వెంకటపద్మ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎలా ఉండాలి, ఏం చేస్తే పిల్లలు భవిష్యత్‌ను బాగా తీర్చిదిద్దగలం, పిల్లల్లో బ్రెయిన్ లోపాలు, సెల్‌ఫోన్ బారి నుంచి బయటపడడం ఎలా అనే అంశాలపై అమెరికా నుంచి వస్తున్న డాక్టర్ చింతపల్లి మీనా ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో రోటరీ క్లబ్ కార్యదర్శి బి.సూర్యలక్ష్మి, జి.వినోద్‌కుమార్, న్యాయవాది కల్యాణ్, డాక్టర్ భేరి రాధికారాణి తదితరులు పాల్గొన్నారు.

# చలికాలం.. ఆరోగ్యం భద్రం!



తెర్లాం: తెర్లాం పట్టణాన్ని కప్పేసిన పొగమంచు

- రోజురోజుకూ పెరుగుతున్న చలితీవ్రత
- ఉదయం, సాయంత్రం దట్టంగా కురుస్తున్న పొగమంచు
- అధికమవుతున్న ఆరోగ్య సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష

**రామభద్రపురం:** వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పాటు చలిగాలులు కూడా వీస్తుండడంతో ప్రజలు చలితో గజగజ వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో శీతాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే వ్యాధుల బారినపడే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి శిరీష చెబుతున్నారు. స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ చిన్ని కృష్ణతో కలిసి ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడం వల్ల చలి బాగా పెరుగుతోందని, చలి తీవ్రతతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందన్నారు. చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండకపోతే వ్యాధుల బారినపడొచ్చని తెలిపారు. జలుబు, జ్వరం రాకుండా చూసుకోవాలని, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లు, ఆయాసం, ఇసినోఫీలియా, ఉబ్బసం వ్యాధులతో బాధపడుతున్న వారు మంచులో ఎక్కువగా తిరగకూడదన్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- నెలల బిడ్డలు, తల్లి పొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి.
- ఏడాది లోపు పిల్లలకు చలిగాలి తగలనీయకూడదు. చలితో చిన్నారులకు ఫిట్స్ వచ్చే అవకావముంది.
- చిన్నపిల్లలతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వస్తే వారి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.
- ఐదేళ్ల లోపు పిల్లలకు స్వెటర్లు, ఉన్ని దుస్తులు వేయాలి.
- అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**పొగమంచుతో ఇక్కట్లు..**

**తెర్లాం:** పట్టణంలో గత కొన్నిరోజులుగా కురుస్తున్న దట్టమైన పొగమంచుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం 7 గంటలైనా మంచు తగ్గకపోవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని మరీ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

# అర్హులందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్లు



ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు సాంబశివరావు

- గ్యాస్ కనెక్షన్ల పంపిణీలో నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు

**నెల్లిమర్ల:** అర్హులందరికీ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను ప్రభుత్వం అందిస్తుందని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగరపంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు అన్నారు. స్థానిక పట్టణంలోని 4, 5, 11 వార్డులకు చెందిన దాదాపు 380 కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత గ్యాస్ కనెక్షన్లను మాజీ సర్పంచ్ చిక్కాల అరుణకుమారితో కలిసి ఆయన ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పట్టణానికి సంబంధించి, 1400 కుటుంబాలకు చెందిన ఇళ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇప్పటికే పట్టాలు పంపిణీ చేసిన లబ్ధిదారులకు అవసరమైతే భూమి కొనుగోలు చేసి, స్థలాలు కేటాయించాలని విన్నవించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చెప్పారు. వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు మాట్లాడుతూ పట్టణానికి చెందిన గ్యాస్ డీలర్ ఉచిత గ్యాస్ కనెక్షన్ల పేరిట వినియోగదారులను మోసం చేశారని ఆరోపించారు. సదరు నిర్వాహకుడు టీడీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. పట్టణంలోని 9 వేల కుటుంబాలకు మరింత పుష్కలంగా తాగునీరు సరఫరా చేయడానికి రూ.35 కోట్లతో రక్షిత మంచినీటి పథకాలు నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, చిక్కాల సుమతి, మొయిద శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రవ్వా నాని, మజ్జి గణేష్, మొయిద మురళి, బూర సత్యనారాయణ, కొండేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

**రామభద్రపురం:** ఓటరు గుర్తింపుకార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయడాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ పి.గణపతిరావు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ జరుగుతున్న తీరును ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఓటుకు ఆధార్ అనుసంధానం ద్వారా చనిపోయిన ఓట్లు, డబుల్ ఎంట్రీలను తొలగించి, సమగ్రమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా గ్రామ, బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఆధార్ సీడింగ్ చేస్తున్నారన్నారు.

# రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి

- ఎమ్మెల్యే కంబాల జోగులు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

**రాజాం:** రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాజాంలోని పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమానంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ విదేశీ కంపెనీలతో పెట్టుబడులు పెట్టించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ద్వారా మౌలిక వసతులను కల్పిస్తున్నారని వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడంతో పాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించారని అన్నారు. టీడీపీ దత్తపుత్రుడుతో పాటు పచ్చమీడియా చంద్రబాబును సీఎం చేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# పెదపోలమ్మ పండగకు సర్వం సిద్ధం



సిరిమాను సిద్ధం చేస్తున్న దృశ్యం

- నేటి నుంచి మూడు రోజుల పాటు సంబరాలు
- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పల నాయుడు పర్యవేక్షణలో ఏర్పాట్లు
- 9న తొలేళ్ల ఉత్సవం, 10న సిరిమానోత్సవం

**బొబ్బిలి రూరల్:** పెదపోలమ్మ సంబరాలకు మండలంలోని పక్కి గ్రామం సిద్ధమైంది. సోమవారం నుంచి దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఐదేళ్లకు ఒకసారి చేపట్టే ఈ వేడులను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల వారు తహతహలాడుతుంటారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు స్వగ్రామం పక్కిలోనే ఈ పండగ జరుగుతుండడంతో ఈ ఏడాది పండగ ఎలా చేస్తారా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండడం విశేషం. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు ప్రస్తుతం పండగ ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. సోమవారం తొలేళ్ల ఉత్సవంతో ఆరంభమయ్యే అమ్మవారి సంబరాలు మంగళవారం సిరిమానోత్సవం బుధవారం అనుపోత్సవంతో ముగుస్తుంది. ఆయా రోజుల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తమ మొక్కులు తీర్చుకుంటారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటాయి. ప్రధానంగా అంజలి రథం, బళ్ల వేషాలు చూపరులను అలరిస్తాయి.



ఉత్సవాలకు ముస్తాబైన పెదపోలమ్మ ఆలయం

### అమ్మవారి దీవెనలతో..



పెదపోలమ్మ వారి దీవెనలతో ప్రతీసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, పోలీసులు, గ్రామస్తుల సహకారం చాలా బాగుంటుంది. అమ్మ వారి సిరిమాను అధిరోహించడం నా పూర్వ జన్మ సుకృతం. ఈ ఏడాది కూడా ఉత్సవాలు బాగా జరిగేలా అమ్మవారు దీవిస్తారు.

– నక్కా పకీరు, సిరిమాను అధిరోహించే పూజారి, పక్కి

# ముగిసిన పోటీలు

**రాజాం సిటీ:** స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండు రోజులుగా జరుగుతున్న జేఎన్‌టీయూ–కే ఇంటర్ కాలేజియేట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రెండో రోజు పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ బహుమతులు అందించారు. మొదటి మూడు స్థానాల్లో సత్తా చాటిన విద్యార్థులు త్వరలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో జేఎన్‌టీయూ–కే తరఫున పాల్గొంటారని ఆయన తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో స్ట్రాంగ్ మెన్‌గా జీఎంఆర్ ఐటీకి చెందిన సీహెచ్ గణేశ్వరరావు, బాడీ బిల్డింగ్ పోటీలలో మిస్టర్ జేఎన్‌టీయూగా సూరంపాలెం ఆదిత్య కళాశాలకు చెందిన బీజీఎస్ఎస్ రామ్‌ప్రసాద్, వెయిట్ లిఫ్టింగ్‌లో స్ట్రాంగ్ మెన్‌గా బీవీసీ కళాశాలకు చెందిన ఎం.వీరభద్ర నిలిచారు. పవర్ లిఫ్టింగ్‌లో మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా జీఎంఆర్ ఐటీ జట్టు ఎంపికైంది. విజేతలను డాక్టర్ జె.గిరీష్, డాక్టర్ శశికుమార్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, కళాశాల సిబ్బంది అభినందించారు.



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన జీఎంఆర్ ఐటీ మహిళల జట్టుతో నిర్వాహకులు

**రాజాం సిటీ:** ఈ నెల 9 నుంచి 12 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇటీవల విజయనగరంలోని గురజాడ జీవీలో జరిగిన ఎంపికల్లో కళాశాలకు చెందిన జి.ప్రసాద్, డి.దేవిప్రదీప్, ఎం.అజయ్‌కుమార్, బి.బాలచంద్రకుమార్ అర్హత సాధించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.గిరీష్, డీన్ స్టూడెంట్ అఫీసర్ డి.శశికుమార్ అభినందించారు.